క్లుప్తంగా

రూ. లక్ష సీజ్

చేగుంట(తూప్రాన్): ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న లక్ష రూపాయలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ బాలరాజ్ తెలిపారు. శనివారం వాహన తనిఖీల్లో భాగంగా మక్కరాజీపేట రోడ్డులో తనిఖీలు జరుపుతుండగా చేగుంట నుంచి మక్కరాజీపేట వైపుకు వెళ్తున్న పశువుల స్వామి వద్ద లక్ష రూపాయలు లభించినట్లు వివరించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎలాంటి పత్రాలు చూపించనందున డబ్బులను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్)లో రమాసహిత వీరవేంకట సత్యనారాయణస్వామి ఆలయం ప్రథమ వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. గ్రామ పురోహితుడు బాపూశర్మ ఆధ్వర్యంలో ఆలయంలో దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అలంకరించారు. ఆనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మజ్జిగ కేంద్రం ఏర్పాటు



మజ్జిక కేంద్రం ప్రారంభిస్తున్న ఎంఈఓ

శివ్వంపేట(నర్సాపూర్): తల్లి జ్ఞాపకార్థం పాఠశాలలో ఏర్పాటు చేసిన మజ్జిక కేంద్రాన్ని ఎంఈఓ బుచ్చనాయక్ శనివారం ప్రారంభించారు. మండల పరిధిలోని ఉసిరికపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ తల్లి వెంకట్‌లక్ష్మి జ్ఞాపకార్థం అతను వేసవికాలంలో విద్యార్థుల కోసం మజ్జిక కేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏదుల్లాపూర్ హెచ్‌ఎం రవికుమార్‌చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న నర్సింహరెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ చప్పెట నర్సింహరెడ్డి మండలేశ్వర శీతలాదేవి ఆలయానికి విరాళం అందించారు. ఈ మేరకు శనివారం చల్మెడ గ్రామంలో రజక సంఘం కులస్తులు నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి తన వంతుగా నర్సింహరెడ్డి రూ. 30 వేలు ఆర్థిక సాయం అందించారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న నవీన్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): రంజాన్ పండుగను పురస్కరించుకొని గ్రామంలోని ముస్లింలకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పులిమామిడి నవీన్‌గుప్తా శనివారం దుస్తులు పంపిణీ చేశాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గౌరీశంకర్, గణేశ్, శ్రీనివాస్, అంజయ్య, సత్తయ్య, మల్లేశ్‌యాదవ్, షేక్‌ఆలీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టేక్మాల్‌కు మంత్రి దామోదర రాక

టేక్మాల్(మెదక్): తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదివారం టేక్మాల్‌కు రానున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేశ్, మడల కోఆప్షన్ సభ్యుడు మజహర్‌లు శనివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు షురూ

నర్సాపూర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం నర్సాపూర్‌తో పాటు పలు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటస్వామిగౌడ్, ఏఎంసీ కార్యదర్శి ప్రతాప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్న చిన్నచింతకుంట, మంతుర్, మహ్మదాబాద్, గూడెం గడ్డ, తుల్జారంపేట్ గ్రామాల్లో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐటీ సిబ్బంది ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు ప్రవీణ, దేవిసింగ్, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని అక్కంపల్లి, శేరీల, మహ్మద్‌నగర్‌తండా, హకింపేట, బొమ్మారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను సీసీలు, మహిళా సంఘాల సభ్యులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శంకరయ్య , సీసీలు సత్యం, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, కిషన్, గ్రామ సంఘాల ఆఫీస్ బేరర్‌లు, కొనుగోలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామాయంపేట మండలంలో..

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట, వెంకటాపూర్, దంతేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

వడియారంలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ గియాసున్నీసాబేగం, ఎంపీడీఓ చిన్నారెడ్డి, డీపీఎం మోహన్, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఆయా గ్రామాల కేంద్రాల నిర్వాహకులు, సీసీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. చిన్నగొట్టిముక్ల, చెన్నాపూర్, ఏదుల్లాపూర్, తిమ్మాపూర్, అల్లీపూర్, గుండ్లపల్లి, బిజ్లీపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముత్రాజీపల్లి, వెంకట్రావ్‌పేటలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు నర్సింలు, నాగరాజు, మహిళా సంఘాల సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



రామాయంపేట(మెదక్): వెంకటాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏపీఎం రాములు



నర్సాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



నర్సాపూర్ రూరల్: తుల్జారాంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సిబ్బంది



పెద్దశంకరంపేట(మెదక్): కమలాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం



తూప్రాన్: వట్టూరులో కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న ఐకేపీ సిబ్బంది



అల్లాదుర్గం మండలంలో..



వడియారంలో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): శీలాంపల్లిలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని బుజ్రాన్‌పల్లి, కమలాపూర్, గొట్టిముక్కుల, కొత్తపేట, జూకల్, బూర్గుపల్లి, శివాయిపల్లి తదితర గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం గోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు నిరంజన్, యోహాన్, సునీత, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఫౌజియాబేగం, కోశాధికారి స్వప్న తదితరులున్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని వెంకట్రావుపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ శేఖర్, సీసీ యశోద పాల్గొన్నారు.

నార్సింగి మండలంలో...

నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మన్నన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఆశోక్ పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: మండలంలోని 10 గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు శనివారం ప్రారంభించినట్లు ఐకేపీ ఏపీఎం రుక్మిణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వట్టూరు, ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, కిష్టాపూర్, నర్సంపల్లి, యావపూర్, ఘనపూర్, వెంకటాయపల్లి గ్రామాల్లో ప్రారంభించినట్లు తెలిపారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా సరైన చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో శీలాంపల్లి, గంగారం గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలోని సోమక్కపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఏపీఎం ప్రేమలత, ఏపీఓ శ్యాంకుమార్, సీసీలు వీఓఏలు పాల్గొన్నారు.

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల పరస్పర సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ నిరోషా సంఘం సిబ్బందితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రేషన్ డీలర్ల జిల్లా నాయకుడు ప్రభాకర్ గుప్తా, సంఘం కార్యదర్శి మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం మండలంలో..

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని కాయిదంపల్లి, సీతానగర్, రాంపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ శంకర్ ప్రారంభించారు.

యువతి అదృశ్యం



వాణి

చేగుంట(తూప్రాన్): మండలంలోని అనంతసాగర్ గ్రామంలో యువతి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతసాగర్ గ్రామానికి చెందిన మాసాయిపేట నర్సింలు మొదటి కూతురు వాణి(20) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటూ టైలరింగ్ చేస్తుంది. శుక్రవారం తెల్లవారు జామున లేచేసరికి వాణి కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోగా ఇంట్లో రూ.12 వేల నగదు సెల్‌ఫోన్ కనిపించలేదు. నర్సింలు ఈ విషయం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



ఆసిఫ్(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): పురుగు మందు తాగిన ఓ యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ సుధారాణి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చండూర్ గ్రామానికి చెందిన మొల్ల ఆసిఫ్ (16) తండ్రి షాదుల్లా మందలించడంతో, మనస్థాపానికి గురైన ఆసిఫ్ ఫిబ్రవరి 22న పురుగుమందు తాగాడు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఆసిఫ్ మృతి చెందాడు. మృతుడి పెద్దనాన్న ఖాసీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ తెలిపారు.

కూలిన కల్వర్టుతో ప్రమాదం



రహదారి మధ్యలో కూలిన కల్వర్టు పైకప్పు

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని మెదక్ - జోగిపేట ప్రధాన రహదారిని కలుపుతూ రంగంపేట గ్రామం మీదుగా పీడబ్ల్యుడీ రోడ్డు ఏడాదిన్నర క్రితం వేశారు. రహదారి నిర్మాణ సమయంలో రంగంపేటలో కల్వర్టు మధ్యలో కూలిపోయినప్పటికీ నిర్మించకుండా వదిలేశారు. దీంతో ఇక్కడ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మల్లన్నగుట్ట వద్ద నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులను ఆలయ కమిటీ సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశం, నాయకులు సుహాసినిరెడ్డి, నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, వెంకటరెడ్డి, నర్సింహరెడ్డి, సుధాకర్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న రాజిరెడ్డి

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న కేంద్ర బలగాలు

కౌల్దారం(నర్సాపూర్): రాబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కౌల్దారం ఎస్‌ఐ సూచించారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు శనివారం మండలంలోని వెంకటాపూర్, పోతంశెట్టిపల్లి, కిష్టాపూర్, రాంపూర్ గ్రామాల్లో సీఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లను నరికిన వ్యక్తికి రూ.5 వేల జరిమానా

తూప్రాన్: పట్టణంలోని రహదారి పక్కన హరితహారం ద్వారా నాటిన చెట్లను నరికివేసిన వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ మేనేజర్ రఘువరన్ శనివారం పేర్కొన్నారు. పట్టణంలోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెట్లను అక్రమంగా కేతారం అనే వ్యక్తి నరికివేసినట్లు గుర్తించామన్నారు. చెట్లను నరికిన అతనికి రూ.5 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లను నరికితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెండా ఆవిష్కరణ.. తొలగించిన అధికారులు



వెల్దుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తున్న మండలాధ్యక్షుడు నర్సింలు



జెండా తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

వెల్దుర్తి(తూప్రాన్): బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం వెల్దుర్తిలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలు బస్టాండ్ చౌరస్తా వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, నవీన్, భరద్వాజ్, గణేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జెండా తొలగించిన అధికారులు..

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా మండల కేంద్రం వెల్దుర్తిలో పార్టీ ఆవిర్భావం పుస్కరించుకొని బీజేపీ నాయకులు ఆవిష్కరించిన జెండాను ఫ్లయింగ్ స్క్వాడ్ కరుణాకర్ ఆదేశంతో పంచాయతీ సిబ్బంది తొలగించారు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేయాలన్నా, పార్టీ జెండాలు ఎగరవేయాలన్నా.. రిటర్నింగ్ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్క్వాడ్ వెంట మండల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారి ఆనంద్ ఉన్నారు.

ధర్మపరిరక్షణ అందరి బాధ్యత

తొగిట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి

పెద్దశంకరంపేట(మెదక్): ధర్మపరిరక్షణ అందరి బాధ్యత అని తొగిట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని బేస్తగల్లిలో నూతనంగా నిర్మించిన దుర్గమ్మ ఆలయంలో ధ్వజస్తంభం, కేశమ్మ, పాపమ్మ, సంతాన నాగేంద్రుడు తదితర విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్‌లు హాజరై ప్రవచనం చేశారు. పురాతన ఆలయాల పునరుద్ధరణ చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, విగ్రాం వేణుగోపాల్‌గౌడ్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళి, రాగం సిద్దు, దాదిగారి గంగాధర్, కె.రవీందర్, దశ్వంత్, సత్యనారాయణ, శ్రావణ్, సీతారం, శ్రీహరి, సతీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠలో మాధవానంద సరస్వతీ స్వామి

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



రామాయంపేటలో బీజేపీ పతాకాన్ని ఎగురవేస్తున్న కార్యకర్తలు



రామాయంపేటలో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహిస్తున్న పార్టీ కార్యకర్తలు



నర్సాపూర్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



పాపన్నపేట(మెదక్): కొత్తపల్లిలో టిఫిన్ చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

జిల్లా వ్యాప్తంగా శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే కార్యకర్తలు అందరూ టిఫిన్స్ బైఠక్ నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరాయంగా బీజేపీ ముందుంటుందని బీజేపీ నాయకులు అన్నారు.



తూప్రాన్‌లో ..



శివ్వంపేట మండలం పిల్లుట్లలో ..



నర్సాపూర్‌లోని పిల్లల పార్కులో..

సంక్షిప్త వార్తలు

◆ **దబుల్ రిజిస్ట్రేషన్ కేసులో ఒకరి రిమాండ్**



మనోహరాబాద్(తూప్రాన్): తప్పుడు దస్తావేజులు తయారు చేసి దొంగ రిజిస్ట్రేషన్ చేసిన వారిలో ఒకరి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ కృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణ ఫిబ్రవరి నెలలో మండలంలోని కూచారం గ్రామ శివారులో ప్లాట్ కొనుగోలు చేశారు. కాగా అట్టి ప్లాట్ వద్దకు రాగా ఈ ప్లాట్ తనదని దుర్గా అనే వ్యక్తి పత్రాలను చూపడంతో మోసపోయినట్లు గ్రహించిన సత్యానారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుల్లో ఒకరు హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన ఖందవల్లి రాజేశ్ దొరకడంతో మెదక్ కోర్టులో హాజరు పర్చగా జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. త్వరలోనే మిగతా వారిని పట్టుకొని అరెస్ట్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

◆ **ఇఫ్తార్ విందులో వంటేరు**

తూప్రాన్: పట్టణంలోని ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మైనార్టీలు పాల్గొన్నారు.

◆ **ఎక్స్‌గ్రేషియా చెల్లింపు**

చిలప్‌చెడ్(నర్సాపూర్): అడవిపంది దాడిలో మృతి చెందిన కుటుంబానికి రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించామని జిల్లా ఆటవీశాఖ అధికారి రవిప్రసాద్ అన్నారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన పన్యాల శంకరయ్య రెండు నెలల క్రితం గ్రామశివారులో కట్టెలు కొట్టేందుకు వెళ్లి అడవిపంది దాడిలో మృతి చెందాడు. దాడి జరిగిన రోజునే తమ సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబానికి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం, జిల్లా ఆటవీశాఖ కార్యాలయంలో మృతుడి కుమారుడు పన్యాల పోచయ్య, కూతురు తంగెడపల్లి నిర్మలకు చెరో రెండున్నర లక్షల చొప్పున రూ.ఐదు లక్షలు ఇవ్వడంతో పాటు, మరో రూ.ఐదు లక్షలు వారి పేరు మీద డిపాజిట్ చేశామన్నారు.



◆ **మద్యం బాటిళ్ల సీజ్**

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల పంచాయతీ దుంపలకుంట చౌరస్తాలో శనివారం రాత్రి బెల్ట్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గౌస్ తెలిపారు. చేకూరి సత్తయ్య కిరాణం దుకాణంలో మద్యం లభ్యమైనట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.